


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 10 సంచిక : 1 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :10 ISSUE :1 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 4 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

- ఎస్ఐఆర్ గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలి
- ఐడీ కార్డుల పంపిణీతో కార్యకర్తలను మరింత క్రియాశీలం చేయాలి
- గ్రామస్థాయి నుంచి ఎన్నికల సన్నద్ధతకు పటిష్ట ప్రణాళిక
- వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

- మిగతా 2లో



## పాలన పక్కనపెట్టి ఈవెంట్ మేనేజ్‌మెంట్

### చంద్రబాబుపై గుడివాడ అమర్నాథ్ విమర్శలు

- పోలవరం పనులు పూర్తయినట్టు ప్రజలను మోసం చేస్తున్నారన్న గుడివాడ
- నీటిని పంప్ చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శ
- నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఆరోపణ

- మిగతా 2లో






## మోదీని అడిగే దమ్ముందా?..

### తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో



## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..

### రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు

పెన్ పవర్ డెస్క్:సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమ య్యను ఆదాయానికి మించి ఆస్తులు కూడ బెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన అధికారులు.. ఆయన

- మిగతా 2లో

## వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు

# నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం

- జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వడం లేదంటూ వైకాపా తప్పుడు ప్రచారం
- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ నీటి విడుదలపై దుష్ప్రచారం
- ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులకు సీఎం ఆదేశం
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సూచన
- నిత్యావసర ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపే పూర్తి చేయాలని సూచన
- కోర్టు సమస్యలున్న 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు



పెన్ పవర్ డెస్క్: జలాశయాల్లో నీళ్లున్నా పంట లకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు.
రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు.
స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జటిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కారించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో
గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.
స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను


- మిగతా 2లో



## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

- దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ
- గంగిరెడ్డి, శివశంకర్ రెడ్డి తదితరుల మధ్య రూ.40 కోట్ల డీల్ జరిగినట్టు ఆరోపణలు
- వివేకాను హత్య చేసేందుకు రూ. 5 కోట్ల ఒప్పందం చేసుకున్నట్టు దస్తగిరి వాంగ్మూలం

- మిగతా 2లో




## 2027 వరకు ఎల్‌నినో..

### డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

- 100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు

- మిగతా 2లో

## రూ.5 కోట్లకు రేప్ కేసుల సెటిల్‌మెంట్?

### పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు



- భగవంత్ మాన్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు
- రూ.5 కోట్లకు రేప్ కేసులు సెటిల్ చేస్తున్నారని ఆరోపణ
- ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ
- ఆడియోలో లేని మాన్, ఆయన భార్య పేర్లు
- గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడ్డ కేసు

పెన్ పవర్ డెస్క్:పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్య మంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది.

- మిగతా 2లో

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం..

### 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

- హైదరాబాద్ గంజాయి కింగ్‌పిన్ నీతూ బాయిపై ఈడీ దాడులు
- మనీలాండరింగ్ ఆరోపణలపై 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఈగల్, ఎక్సైజ్ శాఖ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ కేసు నమోదు
- గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బు, ఆస్తులపై లోతైన దర్యాప్తు
- కుటుంబ సభ్యుల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్టు అనుమానాలు

- మిగతా 2లో





## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

- యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ
- భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ
- బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ
- శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి




## టీడీపీ అడ్డా..ప్రత్యర్థి ఎవరైనా.. పసుపు జెండా రెపరెపరేలేనా?

తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గంలో తిరుగులేని విధంగా ఉంది. అక్కడ టీడీపీకి పోటీ ఇచ్చే పార్టీ లేకుండా పోయింది. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఓటు బ్యాంకు పటిష్టంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. దగ్గుబాటి వెంకటేశ్వర రావు సొంత నియోజకవర్గమైన పర్చూరు తొలి నుంచి టీడీపీకి పట్టు ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పర్చూరు టీడీపీ ఖాతలో పడుతుంది. అయితే దగ్గుబాటి వెంకటేశ్వర రావుకు కుటుంబానికి పర్చూరు నియోజకవర్గంతో ఉన్న అనుబంధం కారణంగా ఆయన టీడీపీ, కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా గెలిచారు. కానీ 2019లో మాత్రం ఆయన వైసీపీ నుంచి పోటీ చేసి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ లో ఆదరించినా, వైసీపీలో మాత్రం దగ్గుబాటిని పర్చూరు దగ్గరకు తీసుకోలేదు.

**దగ్గుబాటికీ తప్పని ఓటమి...**

దీంతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాల నుంచే నిష్క్రమించాల్సి వచ్చింది. 1983 నుంచి మొన్నటి ఎన్నికల వరకూ పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఏడు సార్లు విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ నాలుగు సార్లు గెలిచింది. అయితే వైసీపీ ఇంత వరకూ గెలుపు అక్కడ చూడలేదు. అక్కడ సామాజికవర్గాల పరంగా చూసుకున్నా టీడీపీకి ఓటు బ్యాంకు ఎక్కువగానే కనిపిస్తుంది. తొలి నుంచి ఉమ్మడి ప్రకాశ్రంలోనూ, ఇప్పటి బాపట్ల జిల్లాలో ఉన్న పర్చూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది . ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయాలను సాధించారు. పర్చూరు నియోజకవర్గంలో గుంటూరు ఛానల్ పొడిగింపు వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారు. అందుకే టీడీపీకి వెన్నుదదన్నుగా పర్చూరు నియోజకవర్గం నిలుస్తుంది. అక్కడ పోటీ చేసేందుకు సరైన నాయకుడు లేకపోవడం కూడా ప్రత్యర్థి పార్టీలకు మైనస్ అని చెప్పాలి.

**నేతలను మార్చినా...**

అభివృద్ధి పనులపై ప్రతిపక్ష వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ఛానల్ పొడిగింపు కోసం స్థానికంగా రిలే దీక్షలు కూడా చేపట్టారు.ఇటీవల మండల స్థాయిలో కొత్త అధ్యక్ష, కార్యవర్గాలను ఎన్నుకుంటూ పార్టీని మరింత పటిష్టం చేస్తున్నారు. ఇకవైసీపీ ఇక్కడ నేతలను మార్చి మార్చి బరిలోకి దింపుతున్నా ప్రయోజనం లేకపోతుంది. 2014 నుంచి 2024 ఎన్నికల వరకూ గొట్టిపాటి భరత్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, యడం బాలాజీని పోటీకి దింపారు. అయినా ఫలితం లేదు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత ఆమంచి కృష్ణమోహన్ ను పర్చూరు నియోజకవర్గం ఇన్ ఛార్జిగా నియమించారు. ఆమంచి తర్వాత వైసీపీని వీడి వెళ్లిపోయారు. ప్రస్తుతం గాదె మధుసూదన్ రెడ్డిని పర్చూరు వైసీపీ ఇన్ ఛార్జిగా నియమించారు. అయినా టీడీపీ గెలుపును అడ్డుకోవడం ఇక్కడ కష్టమే.

## 2027 వరకు ఎల్‌నినో.. డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక.. భారత్‌కు మరో వాతావరణ ముప్పు

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.

సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు.ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు.భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది.

ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

**వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షాలు!**

ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్-నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది.

భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

**వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..**

ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది.ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

# అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## పాలన పక్కనపెట్టి ఈవెంట్ మేనేజ్‌మెంట్

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా పక్కనపెట్టి కేవలం ప్రచార ఆర్భాటాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తోనే ముఖ్యమంత్రి కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఇంకా ఏమాత్రం పూర్తి కాకపోయినా, అన్నీ పూర్తయినట్లు చిత్రీకరిస్తూ ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్నాథ్ మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడానికి కూటమి ప్రభుత్వం అంగీకరించడం ద్వారా రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులను దారుణంగా వంచించిందని విమర్శించారు. సహజసిద్ధంగా గ్రావిటీ ద్వారా రావలసిన నీటిని పంపింగ్ సిస్టమ్ ద్వారా తెచ్చి, ఏదో గొప్ప ఘనత సాధించినట్లు ప్రచారం చేసుకోవడం కూటమి ప్రభుత్వ డ్రామాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. పోలవరం కాలువల నిర్మాణంలో చంద్రబాబు నాయుడి పాత్ర ఏమీ లేదని...

దివంగత వైఎస్సార్, వైసీపీ అధినేత జగన్ హయాంలోనే మెజారిటీ పనులు పూర్తయ్యాయని చెప్పారు.

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించినట్లే... చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును తన స్వార్థ రాజకీయాలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఒక 'ఏటీఎం'లా వాడుకుంటున్నారని అమర్నాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేసి, సొంత అనుకూల వర్గాలకు పనులు కట్టబెడుతూ, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో విద్యా, వైద్య రంగాల పురోగతికి జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే పునాదులు పడ్డాయని గుర్తుచేసిన ఆయన, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచార ఆర్భాటాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## వివేకా హత్య కేసులో ఈడీ ఎంట్రీ: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక మూలాలను, మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది.హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు

హాజరయ్యారు.గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చేపడుతున్న ఈ విచారణతో వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సూత్రధారుల చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది.

## మోదీని అడిగే దమ్ముందా?..

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.

గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు

ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

## జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

- మొదటి పేజీ తరువాయి

ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు.నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు.జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తింపు

- మొదటి పేజీ తరువాయి

కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు సంబంధించిన 7 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.సోదాల్లో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు, 8 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.ఇంకా ఇంట్లో సుమారు రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్నట్లు కూడా ఏసీబీ అధికారులు

గుర్తించారు.ఏసీబీ లెక్కల ప్రకారం సోమయ్య ఆస్తుల విలువ రూ.3,54,36,490గా తేలింది. అయితే బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన లావాదేవీలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి

తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు లభించిన అదనపు పది రోజుల గడువును పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్ అంశాలను పరిష్కరించుకోవాలని సూచించారు. పార్టీ ఐడీ కార్డుల పంపిణీని కార్యకర్తలను మరింత క్రియాశీలం చేసే కార్యక్రమంగా నిర్వహిస్తూ, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు సమావేశాలు, 'వెన్నుపోటు పార్టీ--వెన్నుపోటు పాలన' ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఎన్నికల సన్నద్ధత మాటల్లో కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించేలా పటిష్టమైన క్యాలెండర్, సమయపట్టికతో కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీ/పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యే/నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ, 'వెన్నుపోటు పార్టీ--వెన్నుపోటు పాలన' ప్రచారం తదితర అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం.. 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోధా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈగల్ అధికారులు జరిపిన దాడుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా పలువురు బానిసలు ఆమె ఇంటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.అయితే, పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్నప్పటికీ నీతూ బాయి అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. 2024లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఆమె నివాసంపై దాడి చేసి 20 కిలోల గంజాయి, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. సోదాలు ముగిసిన తర్వాత ఈ దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ వెల్లడించే అవకాశం ఉంది.

## రూ.5 కోట్లకు రేప్ కేసుల సెటిల్‌మెంట్?

- మొదటి పేజీ తరువాయి

మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు.

ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది.ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి."భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా? అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# శంఖవరానికి బైపాస్ ఏర్పాటుకు స్థలం పరిశీలన.....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 03:-** శంఖవరం గ్రామంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, గ్రామాభివృద్ధికి దోహదపడేలా బైపాస్ రహదారి నిర్మాణానికి అడుగులు పడు తున్నాయి. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు శంఖవరం గ్రామ పరిధిలో బైపాస్ రహదారి ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పర్వత సురేష్, మండల రెవెన్యూ అధికారి సూరిబాబు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రతిపాదిత బైపాస్ రహదారి కోసం అనువైన ప్రాంతాలను పరిశీలించారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి వివరాలు, అందుబాటులో ఉన్న
ప్రభుత్వ స్థలాలు, రహదారి అనుసంధానం వంటి అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. శంఖవరం గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రాకపోకల నేపథ్యంలో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేం దుకు బైపాస్ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. శంఖవరం గ్రామం నికి బైపాస్ రహదారి అందుబాటులోకి వస్తే గ్రామంలోని ప్రధాన రహదారిపై రద్దీ తగ్గడంతో పాటు, ప్రయాణి కులకు మెరుగైన రవాణా సౌకర్యం కలగనుంది.

ఈ సందర్భంగా అధికారులు స్థల పరిస్థితులను పరిశీలించి, రహదారి నిర్మాణానికి సంబంధించిన అంశాలపై వివరాలు సేకరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, సాధ్యమైనంత త్వరగా బైపాస్ రహదారి ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సీహెచ్ కుమార్, టీడీపీ నాయకులు బుర్రా వాసు, లచ్చబాబు, పిల్లా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన





**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 3:** ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణతో కలిసి జిల్లాలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ లో భాగంగా సభాస్థలి, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్ల కోసం అనువైన ప్రాంతాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలంలో మాచవరం గ్రామ పరిధిలో సచివాలయం 1, 2 కే. పెదపూడి, ఇరుసుమండ గ్రామ పరిధిలో ఉన్న సభాస్థలి హెలిప్యాడ్ కు అనువైన ఖాళీస్థలాలను పరిశీలించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట కొత్తపేట ఆర్డిఓ జీవీ వి సత్యనారాయణ, అంబాజీపేట తహసిల్దార్ జి చిన్న బాబు, కూటమి నాయకులు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోవధకు తరలిస్తున్న 22 ఎద్దులకు విముక్తి

## గండేపల్లిలో వాహన తనిఖీల్లో పట్టుబడ్డ అక్రమ రవాణా.. ఐదుగురిపై కేసు



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్03:**
గోవధ కోసం అక్రమంగా తరలిస్తున్న 22 ఎద్దులను గండేపల్లి పోలీసులు గురువారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 3న ఉదయం సుమారు 5 గంటల సమయంలో గండేపల్లి ఎస్సై యు.వి. శివ నాగబాబు తన సిబ్బందితో కలిసి గండేపల్లి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టీజీ 12 టీ 4906 నంబరు గల లారీని తనిఖీ చేయగా, అందులో 22 ఎద్దులను అత్యంత ఇరుకైన ప్రదేశంలో ఎలాంటి ప్రాథమిక సదుపాయాలు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు.

ఎద్దులకు ఆహారం, నీరు అందుబాటులో లేకుండా, హింసిస్తూ కొత్తవలస నుంచి చిలకలూరిపేట వైపు గోవధ కోసం అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో 22 ఎద్దులను స్వాధీనం చేసుకుని, వాటి సంరక్షణ నిమిత్తం సమీపంలోని గోశాలకు క్షేమంగా తరలించారు.

ఈ ఘటనపై ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును గండేపల్లి ఎస్సై యు.వి. శివ నాగబాబు దర్యాప్తు చేస్తున్నారు.

# ముక్కామలలో శ్రీ కంచి కామకోటి నాదస్వర, డోలు పాఠశాల ప్రారంభం



- సంప్రదాయ కళల పరిరక్షణకు ఇలాంటి పాఠశాలలు ఎంతో అవసరం
- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 3** కంచి కామకోటి 70వ శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య అనుగ్రహంతో ఈ పాఠశాల స్థాపించబడిందని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అన్నారు.

ముక్కామల గ్రామంలో శ్రీ కంచి కామకోటి నాదస్వర ఒ డోలు పాఠశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కంచి కామకోటి 70వ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య అనుగ్రహంతో ఈ పాఠశాల స్థాపించబడిందన్నారు. 2023లో ముక్కామలలో నిర్వహించిన బ్రహ్మసత్రం సందర్భంగా వేద, శైవాగమ పాఠశాలలతో పాటు సంగీత పాఠశాల ఏర్పాటు చేయాలని స్వామి వారు సంకల్పించారని తెలిపారు. నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు సాధారణ విద్యతో పాటు నాదస్వర, డోలు వంటి సంప్రదాయ వృత్తి విద్యలోనూ నైపుణ్యం సాధించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని అన్నారు. నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల ప్రస్తుతం 41 మంది విద్యార్థులకు చేరుకోవడం అభినందనీయమని అన్నారు.

ప్రస్తుతం సుమారు 32 మంది విద్యార్థులు నాదస్వర, డోలు విద్యతో పాటు సాధారణ పాఠశాల విద్యను కూడా అభ్యసిస్తున్నారని తెలిపారు. నిష్ణాతులైన గురువుల ఆధ్వర్యంలో, కంచి కామకోటి పీఠం సహాయ సహకారాలతో పాఠశాల ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందన్నారు. సంప్రదాయ కళలు, సంగీతాన్ని పరిరక్షించడంతో పాటు విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలను అందిస్తున్న ఈ పాఠశాల భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



# గణపతి మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పనిసరి



- గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు
- జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచనలు

**కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబరు 3:** గణేష్ ఉత్సవాలు, గణపతి నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసుశాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం గురువారం పలు మార్గదర్శకాలను విడుదల చేసింది.

అనుమతులకు సింగిల్ విండో విధానం: గణేష్ మండపాల ఏర్పాటుకు ఎలాంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని పోలీసులు తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా అవసరమైన అన్ని అనుమతులు పొందవచ్చన్నారు. ఇందుకోసం స్త్రుఖఅవంప్త్రబ్యిఖజ.అవ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు స్థలంలో మండపం ఏర్పాటు చేస్తే స్థల యజమాని, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే సంబంధిత పంచాయతీ లేదా మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఫైర్, మున్సిపాలిటీ/పంచాయతీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన అనుమతులు కూడా సింగిల్ విండో విధానం ద్వారానే పొందాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా: రహదారులకు అడ్డంగా మండపాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని సూచించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు మండపం వద్ద కనీసం ఒక వాలంటీర్‌ను నియమించాలని, వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మండపాల వద్ద భద్రత: రాత్రివేళ కనీసం ముగ్గురు కమిటీ సభ్యులు లేదా వాలంటీర్లు మండపం వద్ద ఉండి భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. నాలుగు అడుగులకు మించిన విగ్రహాలు ఏర్పాటు చేసిన మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాల నిఘా ఉండాలని తెలిపారు. మండపం స్టేజీ కింద ఖాళీ ప్రదేశాన్ని చెక్కలు లేదా ఇతర సురక్షిత ఏర్పాట్లతో మూసి ఉంచాలని, నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను మండపం వద్ద ఉంచినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులపై అప్రమత్తత: మండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు,వస్తువులు, వాహనాలు ఎక్కువసేపు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మండపం కింద, పరిసర ప్రాంతాలను పరిశీలించాలని, అనుమానం కలిగించే వ్యక్తుల కదలికలను గమనించి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డీజేలు, శబ్ద కాలుష్యంపై నియంత్రణ: పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా డీజేలు, సౌండ్ బాక్సులు, బాణాసంచా వినియోగించరాదని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతి పొందిన మేరకే వీటిని వినియోగించాలని,శబ్దం నిర్ణీత పరిమితులకు లోబడి ఉండేలా చూడాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం పూర్తిగా నిషేధమని తెలిపారు. మండపాల వద్ద భక్తి గీతాలు మాత్రమే ప్రసారం చేయాలని,సినిమా, అసభ్యకర పాటలు వినియోగించ రాదన్నారు. నిమజ్జన ఊరేగింపులో నిబంధనలు: మద్యం సేవించి నిమజ్జన ఊరేగింపులో పాల్గొనరాదని పోలీసులు సూచించారు. పోలీసుశాఖ నిర్దేశించిన రూట్,నిర్ణీత సమయం,ప్రభుత్వం అనుమతించిన నిమజ్జన ఘాట్ వద్ద మాత్రమే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇతర మతాలు, కులాలు, రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో నీటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిషేధం: గణేష్ మండపాలు,నిమజ్జన ఊరేగింపుల్లో సినిమా పాటలు,అశ్లీల నృత్యాలు,అసభ్యకరమైన పాటలు, రికార్డింగ్ డ్యాన్సులు, కొజ్జా మేళం తదితర అసాంఘిక కార్యకలాపాలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. భక్తి గీతాలు మాత్రమే అనుమతించబడతాయని తెలిపారు.

విద్యుత్,అగ్నిప్రమాదాల నివారణ: మండపాల్లో విద్యుత్ వైర్లు,కనెక్షన్లను సక్రమంగా ఏర్పాటు చేసి షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలను నివారించాలని సూచించారు. నూనె దీపాలు వెలిగించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముందుగానే ఇసుక బస్తాలు,నీటి తొట్టెలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మండపాల వద్ద టపాకాయలు,ఇతర పేలుడు పదార్థాలను నిల్వ చేయరాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై అప్రమత్తత: సోషల్ మీడియా ద్వారా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని పోలీసులు సూచించారు. నిర్ధారణ కాని సమాచారాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రతి గణపతి మండప నిర్వాహకుడు సూచనలు తప్పనిసరిగా పాటించి పోలీసుశాఖకు సహకరించాలని కాకినాడ జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కాకినాడ జిల్లా ఎస్పీ





**నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబరు 3:** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, అర్ధరాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి వాహనాల తనిఖీలు, పోలీసుల గస్తీ విధులను పరిశీలించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భానుగుడి, అన్నమ్మ ఘాటీ, డెయిరీ ఫామ్ సెంటర్, సర్పవరం సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు తమ వైఖరిని మార్చుకోవాలని ఎస్పీ బిందుమాధవ్ తీవ్రంగా హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వ్యక్తులు, రౌడీ మూకలు, అలవాటుపడిన నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే వారి నేర చరిత్రను పరిగణనలోకి తీసుకుని పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. కాకినాడ జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎవరినీ ఉపేక్షించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ, వాహన తనిఖీలను మరింత పటిష్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ ఎస్పీ వెంట ఉన్నారు.

## జగ్గంపేటలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** జగ్గంపేట టౌన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 10 మందికి రూ.7,84,639 విలువైన చెక్కులను గురువారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ మోటారు బైక్ పై ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు వరంగా మారాయన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో జ్యోతుల నెహ్రూ కులం, మతం, పార్టీల భేదాలు లేకుండా అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పేరుకే పరిమితమైందని, పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవతో సీఎం సహాయనిధి ద్వారా నేరుగా లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, పాంద్రంగి రాంబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, ఎస్ ఏ గఫూర్, రాయి సాయి, పీలా మహేష్, వైబోగుల కొండబాబు యాదవ్, నేదూరి గణేష్, దుర్గపు ప్రకాష్, సాంబతుల చంద్రశేఖర్, నలమాటి ఆనంద్, చెలికాని హరి గోపాల్, ఎండి కాజా, దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట శ్రీ ప్రజ్ఞలో అంబరాన్నంటిన కృష్ణ జన్మాష్టమి సంబరాలు




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 03:** జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో క్యాంపస్ మొత్తం బృందావనంలా మారిపోయింది. వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో స్టేజ్ పై సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కృష్ణుని విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణాష్టమి శ్లోకాలు ఆలపించి అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు నాగబాబు మాట్లాడుతూ చిన్నారులలో చిన్నతనం నుండే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని, పుస్తకాల చదువుతో పాటు సంస్కృతిని కూడా నేర్పిస్తేనే పరిపూర్ణ విద్యార్థులుగా తీర్చిదిద్దగలమని అన్నారు. ఈ కాం ర్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపల్ కే అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యకు ఐడీపీతో ఆదిత్య యూనివర్సిటీ ఒప్పందం

- విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్, ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 03:**గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఐఈఎల్‌టీఎస్ శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు ఐడీపీ ఎడ్యుకేషన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో–ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో లి'ఐఈఎల్‌టీఎస్––విదేశీ ఉన్నత విద్య'లిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఈఎల్‌టీఎస్ పరీక్ష విధానం, సన్నద్ధత, అవసరమైన స్కోర్లు, విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, విదేశాల్లో ఉన్నత విద్యతో పాటు కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా డా. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచస్థాయి విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలతో పాటు ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఐడీపీ ఎడ్యుకేషన్‌తో కుదిరిన భాగస్వామ్యం ద్వారా ఐఈఎల్‌టీఎస్‌తో పాటు విదేశీ విద్యకు సంబంధించిన మరిన్ని అవకాశాలు, నిపుణుల మార్గదర్శకత్వం విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

ఐడీపీ ఎడ్యుకేషన్––ఆంధ్రప్రదేశ్ ఐఈఎల్‌టీఎస్ కార్యకలాపాలు, వ్యాపార అభివృద్ధి ప్రతినిధి యష్ శర్మ విద్యార్థులకు ఐఈఎల్‌టీఎస్ పరీక్ష, సన్నద్ధత, విదేశీ విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

కార్యక్రమంలో ప్రో వైస్–ఛాన్సలర్ (అకడమిక్స్) డా. రమాశ్రీ, ప్రో వైస్–ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్స్) డా. ఏ. రమేష్, డీన్––కెరీర్ డెవలప్‌మెంట్ డా. సంజీవ్‌రావు, డీన్––ఇంటర్నేషనల్ రిలేషన్స్ డా. రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గీతంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



- కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి.. ఉట్టి కొట్టి ఉత్సాహం



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 03:**గండేపల్లి శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

కార్యక్రమంలో శ్రీ గీతం కరస్పాండెంట్ వి.ఎస్.పీ. చౌదరి మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. కులమతాలకు అతీతంగా పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం తమ పాఠశాల లక్ష్యమన్నారు.

విద్యార్థులు చక్కని వేషధారణలతో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారని, ఇందుకోసం తల్లిదండ్రులు ఎంతో శ్రమించి పిల్లలను సిద్ధం చేసి పంపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పండుగను విద్యార్థులకు పరిచయం చేస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు శ్రీ గీతం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న విద్యార్థులు ఉట్టి కొట్టి సందడి చేయడంతో వేడుకలు మరింత ఉత్సాహభరితంగా సాగాయి. విద్యార్థుల కేరింతలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ జన్మదినవేడుకలు





**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 03**:మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ గారి జన్మదిన వేడుకలు మండల అధ్యక్షులు కురస ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. సందర్భంగా స్థానిక పద్మాజీ గ్రాండ్ హోటల్ లో స్థానిక ఎమ్మెల్యే గారు గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భారీకేక్ కట్ చేసినారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమర్ జన్మదిన సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీచేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల బలరాముర్తి, పి గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి కృష్ణసుందర్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, బిజెపి జిల్లా కార్యదర్శి దంతులూరి రామా వర్మ, కముజు శ్రీను, బిజెపి మండల జనసేన మండల అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, మైపాల తాతాజీ, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి అంతర్వేది దేవి, బిజెపి మండల ఉపాధ్యక్షులు చప్పిడి వెంకటేశ్వరరావు, అయ్యగారి శ్రీను, పేరాబత్తుల సుబ్బారావు అప్పన గణపతి, దొమ్మేటి ప్రసాద్, శ్రీకాకుళం పవన్, రాగిరెడ్డి సాయిరాం, గోనే మడతల కనకరాజు, బక్క శ్రీహరి, గుత్తుల సత్యనారాయణ, నాయకులు నాగాబత్తుల సుబ్బారావు పేరాబత్తుల సుబ్బరాజు, కాగితపల్లి సాయిరాం, అధికారి బాబ్జి, యర్రంశెట్టి వీరభద్రరావు, కొప్పిరెడ్డి ఈశ్వరరావు, వంగా చిన్న, జయను పరాంకుశం తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:**మండల పరిధిలోని 123,122 బూత్ లలో"రెండేళ్ల నమ్మకం –– అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలుతెలియజేసారు . గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి శ్యామ్ గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పోరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, దొమ్మేటి రామారావు, యూనిట్ ఇంచార్జ్ యాగన రాము , కో యూనిట్ ఇంచార్జ్ బచ్చు చినబాబు,, మంద రాజేష్, బూత్ కన్వీనర్ ముష్టి వెంకట రాజేశ్వర్ శర్మ, దుర్గా శీను, కొప్పినీడి ఈశ్వరరావు, పితాని ఈశ్వరరావు, దొమ్మేటి శ్రీహరి, పితాని ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ నాయకులు,ప్రభుత్వ అధికారులు కలిసి పేదల పొట్ట కొట్టొద్దు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** జగ్గంపేట మండలం జటాద్రి కొండ సర్వేనెంబర్ 24లో గత నలభై సంవత్సరాల నుంచి భూమిలేని నిరుపేద రైతులు మామిడి, జీడి మామిడి వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ చెట్లను రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా టిడ్కో కంపెనీ వారికి సోలార్ సిస్టం పెట్టుకోవడానికి పేద రైతులు పండించిన పంటను జెసిబిలతో నరికి వేయడం సరైన పద్ధతి కాదని గురువారం పేద రైతులతో కలిసి ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు జగ్గంపేట తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడా కంపెనీలకు కూటమి ప్రభుత్వ నాయకులు, రెవెన్యూ అధికారులు తొత్తులుగా మారి పేదల పొట్ట కొడుతూన్నారని,వారి బ్రతుకులను రోడ్డున పడేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇలాంటి విషయాల్లో రెవిన్యూ అధికారులు కాకుండా పోలీస్ అధికారులు రావడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రైతులపై పోలీసు వారు చేసిన పనికి మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు.తక్షణమే పేదల భూముల్లో పనులను ఆపాలని, ప్రోక్లైన్లను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పట్ల, కూలీల పట్ల, పేద ప్రజల పట్ల అన్నివేళలా వారికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు గ్రామ నాయకులు నకిరెడ్డి నాగేశ్వరరావు, పెద్దకాపు, రైతులు నూకరాజు, శ్రీనివాసరావు, నాని బాబు, నాగేంద్ర, గంగరాజు, ధర్మరాజు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో అఖిల్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 03:**
కాకినాడ జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడు అఖిల్ విద్యాసంస్థల్లో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అఖిల్ విద్యాసంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించగా,ఉట్టి కొట్టే సన్నివేశాన్ని విద్యార్థులు ఉత్సాహంగా ప్రదర్శించారు.చిన్నారుల వేషధారణలు,సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఇనకోటి గంగాధర్ చిన్నారులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు.భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు,పండుగల ప్రాధాన్యతను చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో సాంస్కృతిక చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు.వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన ఉపాధ్యాయులకు,విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన గురువులకు అభినందనలు తెలిపారు.


# ధర్మవరంలో పలువురికి మురళీకృష్ణంరాజు పరామర్శ





-పలు కుటుంబాలకు ఆర్థికసహాయం అందజేత.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్,03:**ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన పలు కుటుంబాలను పరామర్శించి,బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.గ్రామానికి చెందిన ఐయినవిల్లి చిన్నబ్బాయి,అనసూరి చిట్టిబాబు కుటుంబాలను మురళీ కృష్ణంరాజు పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి,మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.నిరుపేద కుటుంబాలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.అలాగే బొల్లు సత్తాలు భార్య బుచ్చిరాజు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
అనంతరం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రాందేవ్ బాబ్జీని మురళీ కృష్ణంరాజు పరామర్శించి,ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో కోలా తాతబాబు,దాడి పుత్రయ్య,కాపారపు బుజ్జిబాబు,బూరా నానిబాబు,జెడ్డా శ్రీను,దూలపల్లి మనేష్,శ్రీమంతుల జోగిరాజు,బూరా తాతాజీ,రాయుడు దొరబాబు,చిలకలపల్లి శ్రీను,అనసూరి రాంబాబు,నల్ల వెంకటేష్,కర్రి రాము తదితర నాయకులు పాల్గొన్నారు




## జగ్గంపేట భాష్యం స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** జగ్గంపేట రావులమ్మ నగర్ లోని గల భాష్యం పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణ, గోపికమ్మల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇంచార్జ్ గోవిందరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న జెడ్పీ సీఈవో లక్ష్మణరావు

### ఘనంగా సత్కరించిన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు





**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 3:** రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి వి.వి.వి.ఎస్. లక్ష్మణరావును గురువారం కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమం నిర్వహించారు.
2026 సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో గవర్నర్ చేతుల మీదుగా లక్ష్మణరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ సభ్యత్వ నమోదు ప్రక్రియలో విశేష సహకారం అందించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడంలో సీఈవో లక్ష్మణరావు చేసిన కృషి అభినందనీయమన్నారు.భవిష్యత్తులోనూ జిల్లా పరిషత్ పరిపాలనతో పాటు ప్రజాసేవ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ జిల్లా పరిషత్‌కు రాష్ట్రస్థాయిలో మరింత మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.జెడ్పీ సీఈవో లక్ష్మణరావు మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు ప్రక్రియకు సహకరించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం,జిల్లా పరిషత్ ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
జిల్లా రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంతో పాటు ప్రతి నియోజకవర్గంలో రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు లక్ష్మణరావు వెల్లడించారు.కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో డి.శ్రీలలిత,జెడ్పీ పరిపాలనాధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## జిమ్ ట్రైనర్ హత్య కేసులో నలుగురి అరెస్టు



- మార్ఫింగ్ ఫొటోలే హత్యకు కారణం
- అదనపు ఎస్పీ కిషోర్‌కుమార్

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 3:** కాకినాడ భానుగుడి సెంటర్‌లో జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్‌రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ, కాకినాడ ఇన్‌చార్జి ఎస్‌డీపీవో డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం కాకినాడ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన సతీష్‌రెడ్డి ఆగస్టు 26న తెల్లవారుజామున 2 గంటల సమయంలో భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయికిరణ్‌తో పాటు ఇంటి సత్యనారాయణ,ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్‌రెడ్డిపై దాడి చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. తొలుత కాళ్లతో తన్నడంతో పాటు చెక్కబద్దతో తల,ముఖం,శరీరంపై దాడి చేశారని,చెక్కబద్ద విరిగిపోవడంతో దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్‌రెడ్డి గొంతులో పలుమార్లు పొడిచినట్లు తెలిపారు.మార్ఫింగ్ ఫొటోలపై విభేదాలు ప్రధాన నిందితుడు సాయికిరణ్‌కు ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్‌రెడ్డితో విభేదాలు ఏర్పడ్డాయని అదనపు ఎస్పీ తెలిపారు. సాయికిరణ్ మరో యువతితో ఉన్నట్లుగా సతీష్‌రెడ్డి మార్ఫింగ్ చేసిన ఫొటోలను అతని ప్రియురాలికి పంపడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు విచారణలోవెల్లడైందన్నారు. సతీష్‌రెడ్డి తనను చంపుతానని బెదిరించడంతో,అతను బతికి ఉంటే తనకు ప్రాణహాని ఉంటుందనే ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు సాయికిరణ్ విచారణలో వెల్లడించినట్లు పేర్కొన్నారు.
రైల్వే స్టేషన్ వద్ద అరెస్టుమృతుడి అన్న కొడమాటి యర్రయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైం నంబర్ 135/2026 కింద బీఎన్‌ఎస్ సెక్షన్ 103(1) రెడ్‌విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు. నేరం అనంతరం నిందితులు పరారయ్యారు. దుర్గాప్రసాద్ తన బుల్లెట్ మోటార్‌సైకిల్ (ఏపీ 05 ఐచీ 8800)ను కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు సువర్ణకుమారి,ఎల్.భీష్మకుమార్,పి. సత్తిబాబుతో పాటు పోలీసు,క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.విశ్వసనీయ సమాచారంతో రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, బుధవారం సాయంత్రం బుల్లెట్‌ను తీసుకునేందుకు వచ్చిన నలుగురిని అరెస్టు చేశారు.అరెస్టయిన వారిలో బొందల సాయికిరణ్ (30),ఇంటి సత్యనారాయణ (30), ప్రయాగ దుర్గాప్రసాద్ (28), ఇంటి ఆదికృష్ణ (30) ఉన్నారు.వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు,బుల్లెట్ మోటార్‌సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.


## గ్రంథాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 3:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 2026--27 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం కాకినాడలో నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్‌రాజు వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సేవలు అందించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు పాఠకుల అవసరాలకు అనుగుణంగా పుస్తకాలు, మౌలిక వసతులు,ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంపై సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు.గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగార్థులు, పాఠకులకు ఉపయోగపడేలా సేవలను విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలను పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్. కుమారితో పాటు ఆమోద సంఘ సభ్యులుగా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి,జిల్లా పంచాయతీ శాఖ అధికారి,జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి,వయోజన విద్యాశాఖ అధికారి తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. గ్రంథాలయ సంస్థకు సంబంధించిన పలు ప్రతిపాదనలను పరిశీలించి ఆమోదించారు.గ్రంథాలయాలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి విద్యార్థులు, ఉద్యోగార్థులు, పాఠకులు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.గ్రంథాలయాలను కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విద్యా, విజ్ఞాన సమాచార కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ అధికారులు కె.కిషోర్,ఎం.శ్రావ్య, సాయి, వీర్రాజు,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బారెడ్డి సాగర్ నీటిని పొదుపుగా వినియోగించాలి

-పశువులు,తాగునీటి అవసరాలకే పరిమితం చేయాలి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 03:**ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామంలోని సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు సూచించారు.కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారి ఎం సూర్యప్రభ,మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు.ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో పశువుల అవసరాలు,తాగునీటి అవసరాల మేరకు మాత్రమే నీటిని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ అధికారులకు సూచించారు.ఈ సమాచారాన్ని తమ పరిధిలోని గ్రామాలకు చేరవేసి,నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.ఇందులో భాగంగా ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం,వేములపాలెం గ్రామాల్లోనూ ఏఓ జోకా అమృత ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రస్తుత నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.రైతులు ఆరుతడి పంటలు కానీ,పిఎండిఎస్ పంటలు వేసుకోవాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మల్లేపల్లి వాసి

**గండేపల్లి, సెప్టెంబర్ 0 3:**రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 65 ఏళ్ల వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి గ్రామానికి చెందిన భోగాది సోమరాజు (65), గత నెల 24న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన ఎక్సెల్ బండిపై ఇంటి నుంచి పొలానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మల్లేపల్లి హైస్కూల్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న టాటా ఎంట్రా వాహనం డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి సోమరాజు ప్రయాణిస్తున్న ఎక్సెల్ బండిని ఢీకొట్టాడు.
ఈ ప్రమాదంలో సోమరాజుకు తలకు, కాలి మడమకు తీవ్ర రక్తగాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 03 గురువారం న మృతి చెందారు.
మృతుడి మనవడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్సై యు.వి. శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో ఎన్ఆర్ఐ శశియాదవ్ పలు సేవా కార్యక్రమాలు.

-ఉట్టి కొట్టే విజేతలకు స్కై ఫౌండేషన్ ద్వారా బహుమతులు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 03:**కృష్ణాష్టమి సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కృష్ణుని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ శశి యాదవ్ తెలిపారు.ముందుగా జిల్లా ప్రజలందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శశి యాదవ్ మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించే ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో విజేతలకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందించనున్నట్లు శశి యాదవ్ తెలిపారు.నియోజకవర్గంలోని చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఇప్పటికే ప్రత్తిపాడులో నిర్వహించిన ఉద్యోగ మేళా ద్వారా పలువురు విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.భవిష్యత్తులోనూ నియోజకవర్గంలోని చదువుకున్న యువతకు అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.తమ పూర్వీకులు ప్రత్తిపాడు,పిఠాపురం,కాకినాడ ప్రాంతాల్లో నివసించేవారని,ఈ ప్రాంతంతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని శశి యాదవ్ తెలిపారు.అందుకే స్కై ఫౌండేషన్ ద్వారా ప్రత్తిపాడు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు మీడియా ముఖంగా వెల్లడించారు.

## కాకినాడ జిల్లాలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

**సెప్టెంబరు 5న జేఎన్‌టీయూ అలుమ్ని ఆడిటోరియంలో నిర్వహణ**

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 3:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని,భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమించే గురువులకు సముచిత గౌరవం అందించేలా సెప్టెంబరు 5న కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు.

దేశ మాజీ రాష్ట్రపతి,తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 5న కాకినాడ నగరంలోని జేఎన్‌టీయూ అలుమ్ని ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌తో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు.విద్యా ప్రమాణాల మెరుగుదలకు విశేష కృషి చేస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించ నున్నట్లు డీఈవో తెలిపారు.జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు,ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై గురుపూజోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని డీఈవో పి. రమేష్ కోరారు.

## శ్రీ ప్రతిభ విద్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- చిన్నికృష్ణుల వేషధారణతో అలరించిన విద్యార్థులు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 03:** ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని శ్రీ ప్రతిభ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఎంతో ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు,గోపికల వేషధారణతో ఎంతగానో అలరించారు.తల్లిదండ్రులు తమ చిన్నారులను అందంగా ముస్తాబు చేసి పాఠశాలకు తీసుకువచ్చారు.ముందుగా శ్రీ ప్రతిభ విద్యాలయ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దాసం వరలక్ష్మి,పాఠశాల అధినేత దాసరి శేషారావు రాధాకృష్ణుల విగ్రహాలను పీఠంపై ప్రతిష్ఠించి,పూలమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం హారతి ఇచ్చారు.జై కృష్ణ.. జై జై కృష్ణ నినాదాల మధ్య చిన్నికృష్ణులు దహీ హండీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మట్టి కుండను కొట్టి వేడుకలను సందడిగా మార్చారు.ఈ సందర్భంగా పాఠశాల అధినేత దాసరి శేషారావు మాట్లాడుతూ కృష్ణ జయంతి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు,తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం,శాంతి,విజయాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ పండగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఓ నాగేశ్వరరావు,ప్రధానోపాధ్యాయులు,సత్యనారాయణ,ప్రైమరీ ప్రధానోపాధ్యాయిని,బి రాణి, ప్రైమరీ ఇన్‌చార్జ్ నాగజ్యోతి,ఉపాధ్యాయినులు,సుజాత,ఆశారాణి,వీరమణి,వరలక్ష్మి,జ్యోతి,నాగలక్ష్మి,లలిత తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.70 కోట్లతో పరదేశమ్మ చెరువు పార్కు

- దోబీ ఘాట్ అభివృద్ధి పనులకు
- ఎమ్మెల్యే కొండబాబు శంకుస్థాపన



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 3 :** కాకినాడ నగరంలోని జగన్నాథపురం 21, 23 వార్డుల పరిధిలో ఉన్న చారిత్రక పరదేశమ్మ చెరువు, దోబీ ఘాట్‌ల సమగ్ర అభివృద్ధి,సుందరీకరణ పనులకు నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) గురువారం శంకుస్థాపన చేశారు. అమృత్ పథకం కింద మంజూరైన రూ.1.70 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద వాకింగ్ ట్రాక్,రక్షణ గోడలు,ఓపెన్ జిమ్, లైటింగ్ ఏర్పాటు చేసి పరదేశమ్మ చెరువు పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినప్పటికీ,గత ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా అవన్నీ దెబ్బతిన్నాయని అన్నారు. ప్రజలు అందించిన బలంతో వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు.అమృత్ పథకం నిధులతో ఆధునిక వాకింగ్ ట్రాక్, నూతన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ గోడ ఎత్తును పెంచుతామని తెలిపారు.వాకర్ల కోసం ప్లాట్‌ఫారమ్‌లను ఆధునీకరించనున్నట్లు చెప్పారు. చెరువులోని పూడిక,కలుషిత నీటిని తొలగించి డీసిల్టేషన్ పనులు చేపట్టి స్వచ్ఛమైన నీటిని నింపేలా చర్యలుతీసుకుంటామన్నారు.నగరంలోని కుళాయి చెరువు తరహాలోనే పరదేశమ్మ చెరువు, దోబీ ఘాట్‌లను సరికొత్త పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక పాలిటెక్నిక్ మైదానం, ఎంఎస్ఎన్ చారిటీస్ గ్రౌండ్లలోనూ వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో తెప్పల రామలింగేశ్వరరావు,బూడి ప్రకాష్,సయిద్ ఆలీ,మండపాక దుర్గాప్రసాద్, అన్వర్,అయేషా,గెడ్డం పూర్ణచంద్రశేఖర్,ఎర్రెల్లి ఏసు, అయినవిల్లి పద్మ, నూరుకుర్తి సాయి, మేరేటి లక్ష్మిదుర్గ,రాళ్లపూడి ప్రకాష్, ఇమంది చంద్రావు తదితరులతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# బడుగువానిలంక నదీ కోత నివారణకు అడ్డుకట్ట పడింది







**రూ.63.83 కోట్లతో గ్రోయిన్స్,రివిట్మెంట్ నిర్మాణం**



**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 03:**గత ఏడాది వరదలకు ఆ గ్రామస్తులంతా బిక్కుబిక్కుమంటే ఉన్నారు. రైతుల కళ్లెదుటే లక్షలాది రూపాయల విలువైన తమ భూములు నదీ గర్భంలో కొట్టికుపోతుంటే అల్లాడిపోయారు.భవిష్యత్తుపై అంతులేని బెంగ పెట్టుకున్నారు. కాని కాలం కలిసి వచ్చింది. నదీకోతకు గురికాకుండా భూముల రక్షణకు పట్టిష్టమైన గ్రోయన్స్ నిర్మించారు.రిలయన్స్ పైపులైన సంస్థ సహకారంతో రూ.63.83 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. వివారాల్లోకి వెలితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో కోట్లాది రూపాయలు విలువైన వందల ఎకరాల లంక భూములు నదీ గర్భంలో కలిసిపోయాయి. ఆ గ్రామంలోని పుష్కరాల రేవుకు అటు ఇటు 2007 సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఆలమూరు ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి ఆధ్యర్యంలో రివీట్మెంట్లు, గ్రోయిన్స్ నిర్మించారు. దాంతో ఆ ప్రాంతంలో కోత నివారణ ఆగింది. అనంతరం రిలయన్స్ పైపు లైన్ నిర్మించిన ప్రాంతంలో అధికంగా కోతకు గురవడం మొదలుపెట్టింది. దీనిపై రిలయన్స్ అనుబంధ సంస్థ పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పిఐఎల్) వారు 2023లో కిలోమీటర్నర పొడవునా రూ.41.63 కోట్లతో అప్పటి కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆద్వర్యంలో రివిట్మెంట్ నిర్మించారు.కాని అది ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. వరదలకు ఆ రాతి రివిట్మెంట్ లేచిపోయి పంట పొలాలను కోతకు గురి చేసింది. గ్రోయిన్స్ లేకుండా కేవలం రివిట్మెంట్ నిర్మించడం వల్ల నదీ ప్రవాహ వత్తిడిని తట్టుకోలేక పోయింది. దీనిపై ఇరిగేషన్ హెడ్ వర్క్స ఇంజనీర్లు వారు సరైన అవగాహన లేక ఆ విధంగా డిజైన్ చేసారు. ఫలితంగా గతేడాది వరదలకు రివిట్మెంట్ డొల్లతనం బయటపడింది.దీంతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ద్వారా రిలయన్స్ సంస్థ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితిని గుర్తించిన ఆ సంస్థ వారు రూ. 63.83 కోట్లు మంజూరు చేశారు. స్థానిక ఇంజనీరింగ్ అధికారులు కాకుండా చెన్నై ఐఐటి విద్యార్థులతో ఈ గ్రోయిన్స్ ను డిజైన్ చేయించారు. పూర్తి పటిష్టంగా రాతి కట్టడంతో వీటిని నిర్మించారు.పాత రివిట్మెంట్ నుంచి మొదటి గ్రోయిన్ ధవళేశ్వరం బ్యారేజ్ వైపు 40 మీటర్ల పొడవునా గోదావరి నదిలోకి నిర్మించారు. అలాగే రెండవ, మూడవ గ్రోయిన్స్ ను 45 మీటర్లు పొడవన నిర్మించారు.చివరగా నాలుగవ గ్రోయిన్ రావులపాలెం వైపు 30 మీటర్ల పొడవునా నిర్మించారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి నేరుగా విడుదలయ్యే వరద నీటి ప్రవాహ వేగాన్ని నియంత్రించడం ద్వారా కోత నివారణకు అడ్డుకట్ట పడింది.అంతేకాకుండా గత వరదల కాలంలో పూర్తిగా ధ్వంసమైన 125 మీటర్ల రివిట్మెంట్ ను పటిష్ఠ పరిచారు. గత నెలలో వచ్చిన వరదలకు ఆ ప్రాంతం ఏమాత్రం చెక్కుచెదరలేదు.ఈ రాతి కట్టడాలు పూర్తిగా నదీకోతకు అడ్డుకట్ట వేసాయి. అలాగే ఇంత పెద్ద మొత్తంలో పనులు జరగడానికి వేలాది వాహనాలు ద్వారా మెటీరియల్ ను తరలించారు. ఈ వాహనాలు రావడానికి అనుకూలంగా కాంట్రాక్టు సంస్థ పెద్ద ఎత్తున పుంత రోడ్లును పటిష్ఠ పరిచింది. ఫలితంగా ఆ ప్రాంతం రైతులకు మెరుగైన రహదారుల సదుపాయం ఏర్పడింది. మొత్తానికి ఇక్కడ నదీ కోత నివారణకు సహకరించిన రిలయన్స్ పైపు లైన్ సంస్థకు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తదితర అధికారులకు బడుగువానిలంక గ్రామస్థులు, రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.






- చట్టాలపై అవగాహనతోనే బాలల భద్రత సాధ్యం.
- జగ్గంపేట సిఐ,బి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై, జి సతీష్.

**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 03:**సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సిఐ, బి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ అన్నారు.కిర్లంపూడి సత్యశ్రీ ప్రైమరీ స్కూల్లో సైబర్ నేరాలు,బాలల రక్షణ చట్టాలు,పోక్సో చట్టాలపై విద్యార్థులు,తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగ్గంపేట సీఐ,బి తిరుపతిరావు,కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ లు పాల్గొని విద్యార్థులు,తల్లిదండ్రులకు పలు చట్టాలు,రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,మొబైల్ ఫోన్లు,సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.ఓటీపీ,పాస్‌వర్డ్‌లు వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని వివరించారు.అలాగే బాలలపై జరిగే వేధింపులు,లైంగిక దాడుల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం,బాలల హక్కులు,చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ యల్లపు నరసారావు,అధ్యాపక బృందం,సుమారు 300 మంది తల్లిదండ్రులు,400 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుమలలో భక్తుల సందడి.... నిత్య అన్నప్రసాదానికి రూ.1.00 లక్ష విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 3:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన చందన స్వరూప శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ సన్నిధికి గురువారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.గురువారం ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేదమంత్రోచ్ఛారణలు, పూజా కార్యక్రమాల మధ్య స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా కాతేరు గ్రామానికి చెందిన బొల్లి రత్నాజీ రావు--సరోజిని దంపతులు, వారి కుటుంబ సభ్యులు స్వామివారి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి రూ.1,00,116/- విరాళంగా సమర్పించారు. భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించే కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించడం పట్ల ఆలయ వర్గాలు అభినందనలు తెలిపారు.

విరాళం సమర్పించిన బొల్లి రత్నాజీ రావు--సరోజిని దంపతులు, కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. స్వామివారి సేవా కార్యక్రమాల్లో భక్తులు భాగస్వాములు కావడం అభినందనీయమని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కత్తిపూడి మాధురి విద్యాలయం లో కృష్ణాష్టమి వేడుకలు.....






**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 03:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం కత్తిపూడి గ్రామము లోని మాధురి విద్యాలయ నందు ముందుగానే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం తో ప్రారంభించారు ఈ కార్యక్రమం తో మాధుల విద్యాలయ ఛైర్మెన్ తమ్మయ్య నాయడు డైరెక్టర్ కడారి సీతాదేవి పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం మనకు ధర్మమార్గంలో నడవడం, కష్టాలను ధైర్యంగా ఎదుర్కో వడం, మంచి విజయాలను పెంటించడం నేర్పుతుంది. విద్యార్థులు కు ఆయన బోధనలను తమ జీవితాల్లో ప్రచరించాలి. అని తెలిపారు.

వేడుకల్లో భాగంగాం శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో, చిన్నారుల భక్తి గీతాలం, శీకాలు, వృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలతో ఉట్టి కొట్టుడం కార్యక్రమం ప్రదర్శించారు ప్రారర్శించారు.

ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఆది నారాయణ. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది. పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రియదర్శిని బాలవిహార్‌లో విద్యార్థులే గురువులైన వేళ






**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబరు 3:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రియదర్శిని బాలవిహార్‌లో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు వివిధ అంశాలపై పాఠాలు బోధించారు. మొత్తం 33 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక పాఠాన్ని పలుమార్లు చదవడం కంటే ఇతరులకు బోధించడం ద్వారా మరింత అవగాహన కలుగుతుందని కరస్పాండెంట్ బుద్ధ చంద్రదేవ్ తెలిపారు. నేర్చుకోవడానికి ఉత్తమ మార్గం నేర్పించడమేనన్న సెనెకా సూక్తికి విద్యార్థులు జీవం పోశారని అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య అన్నారు. బోధన ద్వారా విద్యార్థుల్లో బాధ్యత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సహానుభూతి పెంపొందుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో విద్యార్థులు పాఠాలు బోధించారు. ఆయా అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు ప్రకటించారు. అయితే ఈ స్థానాలు ప్రోత్సాహం కోసమేనని, ఎవరినీ నిరుత్సాహపరచడం ఉద్దేశం కాదని బుద్ధ చంద్రదేవ్ తెలిపారు.

## గొల్లపాలెం జెడ్పీ పాఠశాలలో 'ల్యాబ్ ఆన్ వీల్స్' సందర్శించిన డీఈవో



**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 3:** గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్ఫోసిస్ సంస్థ ఏర్పాటు చేసిన 'ల్యాబ్ ఆన్ వీల్స్' బస్సును కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బస్సులో విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక, కోడింగ్ శిక్షణను పరిశీలించారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థులు కోడింగ్ అంశాలను ఏ మేరకు అవగాహన చేసుకున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేలా పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు ల్యాబ్ ఆన్ వీల్స్ బస్సు గొల్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-1 డి. డేవిడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు సుశీలామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గెడ్డం సత్యనారాయణ మృతి తీరని లోటు



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 3:** ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకనిగా కార్మిక సమస్యలపై ఎనలేని కృషి చేసిన స్వర్గీయ గెడ్డం సత్యనారాయణ మృతి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సత్యనారాయణ చిత్రపటానికి అంబాజీపేట లోని ఆయన స్వగృహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత వర్గాల సమస్యలపై కూడా ఆయన ఎంతగానో కృషి చేశారని అన్నారు. కుమారుడు లక్ష్మీనారాయణను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు మైలె ఆనందరావు, విప్పర్తి ప్రభుదాసు, చింతా రాజేంద్రప్రసాద్, నేలపూడి నాగభూషణం, సాధనాల బాలకృష్ణ, ఇసుక పట్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## పౌడర్ ట్యాంక్‌లో పడి యువ కార్మికుడి మృతి

**ఈతకోట శివారులోని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో విషాదం**

**విధుల్లో ఉండగా ప్రమాదం.. ఆసుపత్రికి తరలించేలోపే మృత్యువాత**

పెన్ పవర్ ప్రతినిధి (రావులపాలెం) సెప్టెంబర్ 3: అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట గ్రామ శివారులోని ఓ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 23 ఏళ్ల యువ కార్మికుడు మృతి చెందాడు. విధుల్లో భాగంగా పౌడర్ ట్యాంక్‌పైకి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడిపోవడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈతకోట శివారులోని రమ్య ఫుడ్స్ ఎల్ఎల్‌పీ పరిశ్రమలో బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. గంటి గ్రామానికి చెందిన గుత్తుల రాజు (23) కంపెనీలో జనరల్ ఆపరేటర్‌కు హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా పౌడర్ ట్యాంక్‌పైకి వెళ్లిన రాజు ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు.

రాజు ట్యాంక్‌లో పడిన విషయాన్ని గమనించిన కంపెనీ సిబ్బంది వెంటనే యంత్రాన్ని నిలిపివేసి అతడిని బయటకు తీసే చర్యలు చేపట్టారు. అనంతరం చికిత్స కోసం రావులపాలెంలోని రికవరీ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో రాత్రి సుమారు 8.30 గంటలకు ఆసుపత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

రాజు మృతి విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి తల్లి గుత్తుల భారతి గురువారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాజు గంటి గ్రామంలోని శెట్టిబలిజపేట, రామాలయం సమీపంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు


కేసు నమోదు అనంతరం పోలీసులు గురువారం పరిశ్రమకు చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రాజు ట్యాంక్‌పైకి ఎందుకు వెళ్లాడు? ప్రమాదం ఏ విధంగా జరిగింది? ట్యాంక్ వద్ద భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ప్రమాద సమయంలో కంపెనీ సిబ్బంది ఎక్కడ ఉన్నారు? తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక సమాచారం మేరకు రాజు ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడిపోవడం వల్లే మృతి చెందినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని నిర్ధారించలేమని స్పష్టం చేశారు.


పరిశ్రమలో భద్రతా ప్రమాణాల అమలు, యంత్రాల నిర్వహణ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు తదితర అంశాలను కూడా దర్యాప్తులో పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

దర్యాప్తు పూర్తయిన అనంతరం ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని రావులపాలెం టౌన్ సీఐ జి. రమేష్ బాబు తెలిపారు.

23 ఏళ్ల వయసులోనే రాజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. యువకుడి మృతితో గంటి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## కంచిబోయిన కొండయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా...






**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 03:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కంచిబోయిన శ్రీను తండ్రి కంచిబోయిన కొండయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా గురువారం కత్తిపూడిలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కొండయ్య మృతికి సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొండయ్య మృతి కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు అన్నారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పర్వత సురేష్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు, ప్రత్తిపాడు మార్కెటింగ్ యార్డు చైర్మన్ బద్ధి మణి రామారావు, సొసైటీ చైర్మన్ గాబు కృష్ణ, కీర్తి సుభాష్, కత్తిపూడి టౌన్ ప్రెసిడెంట్ కేలంగి జనార్ధన్, మాజీ ఎంపీటీసీ సాధనాల లక్ష్మీ బాబు,గోవిందు, బి లోవరాజు, గజ్జి బ్రదర్స్, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల పదవీకాలం పూర్తి.. ఎంపీటీసీలకు ఘన సన్మానం

**మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మార్గాన గంగాధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం**




**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబరు 3:** కొత్తపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఎంపీటీసీ సభ్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీపీ మార్గాన గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులందరినీ ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఈ సందర్భంగా మండల అభివృద్ధిలో ఎంపీటీసీ సభ్యులు అందించిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సభ్యుల సేవలను గుర్తు చేసుకున్నారు. ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, మరో రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి డేవిడ్‌రాజ్, ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బిళ్లకుర్రు ఎంపీటీసీ-2 సభ్యురాలు బొక్క నాగరాణి, లోకేష్‌లను ఎంపీపీ మార్గాన గంగాధర్ శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మార్గాన గంగాధర్ మాట్లాడుతూ.. మండల పరిషత్ ప్రజాప్రతినిధులుగా ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించిన ఎంపీటీసీ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీటీసీల పాత్ర కీలకమన్నారు. పదవీకాలం ముగిసినా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్



## రోహిత్ శర్మ రిటైర్మెంట్ రూమర్స్‌కు బీసీసీఐ చెక్..
# పుకార్లను నమ్మొద్దన్న దేవజిత్ సైకియా




**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ఊహాగానాలకు బీసీసీఐ తెరదించింది. ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈరోజు (సెప్టెంబర్ 3న) జరిగిన సమీక్షా సమావేశం అనంతరం రోహిత్ స్థానానికి ఎలాంటి ముప్పు లేదని భారత క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. రోహిత్ భవిష్యత్తుపై ప్రస్తుతం యథాతథ స్థితి కొనసాగుతుందని, అతడు ప్రసుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా స్పష్టం చేశారు.

**హై-వోల్టేజ్ మీటింగ్.. చీఫ్ సెలెక్టర్ అగార్కర్ గైర్హాజరీ:**

ఈ కీలక భేటీకి వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ నేరుగా హాజరయ్యారు. అయితే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ సమావేశానికి గైర్హాజరు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబైకి దూరంగా ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతంలో ఉండటం వల్లే అగార్కర్ హాజరుకాలేదని సమాచారం ఉన్నప్పటికీ, ఆయన గైర్హాజరీపై క్రికెట్ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**లక్ష్మణ్ కొత్త రోల్, సెలెక్షన్ కమిటీ మార్పులపై క్లారిటీ:**


మరోవైపు వీవీఎస్ లక్ష్మణ్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ లాంటి కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా

పూర్తిగా తోసిపుచ్చారు. అలాగే అజిత్ అగార్కర్ నాయకత్వంలోని సెలెక్షన్ కమిటీలో ఎలాంటి తక్షణ మార్పులు చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ సమావేశానికి అగార్కర్ రాకపోయినప్పటికీ సెలెక్షన్ ప్యానెల్ తీరుపై ఎలాంటి అసంతృప్తి లేదని, ప్రస్తుతానికి అదే కమిటీని ముందుకు కొనసాగిస్తున్నట్లు బోర్డు తేల్చి చెప్పింది.

**రోహిత్ ఫామ్‌పై ప్రశంసలు.. వరల్డ్ కప్ రేసులో హిట్‌మ్యాన్:**

ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో లార్డ్స్ మైదానంలో 138 పరుగులతో విరుచుకుపడిన స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ బ్యాటింగ్ శైలిని దేవజిత్ సైకియా ప్రత్యేకంగా కొనియాడారు. రోహిత్ ఎంత అద్భుతంగా ఆడుతున్నాడో మీరు కూడా చూస్తున్నారు కదా అని వ్యాఖ్యానిస్తూ, అతని స్థానం ఇప్పటికిప్పుడు ఎలాంటి ప్రమాదంలో లేదూ, ప్రస్తుతం జరుగుతున్న పుకార్లకు అడ్డుకట్ట వేశారు. దీంతో 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ శర్మ భాగస్వామ్యంపై బీసీసీఐ సానుకూలంగా ఉందనే విషయం స్పష్టమైంది.

# గాయమంటూ దొంగ నాటకాలు.. పాకిస్థాన్ ఓపెనర్‌పై రెండేళ్ల బ్యాన్..




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఓపెనర్ ఇమామ్-వుల్-హక్ అంతర్జాతీయ కెరీర్ తీవ్ర ప్రమాదంలో పడింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో గాయం పేరుతో దొంగ నాటకలు ఆడారనే తీవ్ర ఆరోపణలతో అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఏకంగా 2 ఏళ్ల పాటు బ్యాన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన ఇమామ్, రెండో టెస్టులో పిక్క కండరాల గాయం నెపంతో రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ అతను నిజమైన గాయంతో బాధపడటం లేదని, కేవలం బ్యాటింగ్ నుంచి తప్పించుకునేందుకే డ్రామా ఆడాడని పాక్ క్రికెట్ బోర్డు (గ్రాజదీ) అనుమానిస్తోంది.

**పీసీబీ హై-లెవెల్ ఇంక్వైరీ:**

ఇమామ్ ఇలా గాయం పేరుతో డ్రామాలు ఆడటం ఇది మొదటిసారి కాదని తెలుస్తోంది. మార్చి 2025లో న్యూజిలాండ్ పర్యటనలోనూ ఇండోర్ నెట్ ప్రాక్టీస్ సమయంలో కుడి కాలి వేలికి గాయమైందంటూ మెడికల్ టీమ్‌ను తప్పుదోవ పట్టించి జట్టు నుంచి తప్పుకున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. తాజాగా లార్డ్స్ టెస్టులో కూడా అదే పునరావృతం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పీసీబీ, ఇమామ్‌పై విచారణకు ఒక హై-లెవెల్ కమిటీని నియమించింది. విచారణలో అతడు దోషిగా తేలితే 1 నుంచి 2 ఏళ్ల పాటు క్రికెట్ ఆడకుండా కఠినంగా నిషేధించనున్నారు.

**మహమ్మద్ రిజ్వాన్ కెరీర్ ఎండ్ కార్డ్:**

మరోవైపు స్టార్ వికెట్ కీపర్, పాక్ మాజీ వైట్ బాల్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ పరిస్థితి కూడా అత్యంత దారుణంగా తయారైంది. మూడో టెస్టుకు ముందే పీసీబీ జట్టు నుంచి తొలగించి పాకిస్థాన్‌కు పంపించిన 7 గురు ఆటగాళ్లలో రిజ్వాన్ కూడా ఉన్నాడు. జట్టులో క్రమశిక్షణారాహిత్యంతో ప్రవర్తించడం, మైదానంలో బాధ్యతారాహిత్యంగా చెత్త షాట్లు కొడుతూ వికెట్ పారేసుకోవడంపై పాక్ బోర్డు సీరియస్ అయింది. దీంతో రిజ్వాన్ అంతర్జాతీయ కెరీర్‌కు దాదాపు ఎండ్ కార్డ్ పడినట్లేనని, సమీప భవిష్యత్తులో అతను మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చే అవకాశాలు లేవని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**పాక్ క్రికెట్‌లో ఊచకోత.. షాక్‌లో ఆటగాళ్లు:**

ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన పరాజయాల తర్వాత పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా ఏడుగురు ప్లేయర్లను అర్ధాంతరంగా టూర్ నుంచి తప్పించి స్వదేశానికి పంపడంతో లంక, ఇంగ్లాండ్ సిరీస్‌లు ఆడుతున్న ఆటగాళ్లు షాక్‌లో ఉండిపోయారు. ఒకవైపు డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, మరోవైపు ఇమామ్, రిజ్వాన్ వంటి సీనియర్లపై కఠిన చర్యలతో పాక్ క్రికెట్‌లో ప్రస్తుతం తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

# నేను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటం లేదు.. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో తన రోల్‌పై ఎంఎస్ ధోనీ క్లారిటీ!




**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజం, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి తన రోల్‌పై కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు సీఎస్కే మాజీ ఆటగాడు ఎస్. బద్రీనాథ్ వెల్లడించాడు. రాబోయే సీజన్‌లో ధోనీపై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనిని ఇంపాక్ట్ ప్లేయర్ గా వాడుకోవాలని ఫ్రాంచైజీ భావిస్తున్నప్పటికీ, తాను మాత్రం పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే బరిలోకి దిగుతానని ధోనీ తేల్చిచెప్పాడట. తాను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడనని, 20 ఓవర్ల పాటు మైదానంలో ఉంటూ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తానని ధోనీ నాతో వ్యక్తిగతంగా చెప్పాడని బద్రీనాథ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టం చేశాడు.

**వ్యూహాత్మకంగా మేలైనా.. ధోనీ పట్టుదల అదే:**

వయసు రీత్యా శరీరంలో ఫిట్‌నెస్ సమస్యలు ఎదురవుతున్నందున ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగిస్తే సీఎస్కేకు వ్యూహాత్మకంగా ఎంతో మేలు జరుగుతుందని బద్రీనాథ్ అభిప్రాయపడ్డాడు. ధోనీ శరీరం సుదీర్ఘ సమయం తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేకపోతోందని, అతను కేవలం 16వ ఓవర్ తర్వాతే బ్యాటింగ్‌కు వస్తున్నందున కీపింగ్‌కు బదులు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటమే ఉత్తమమని కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా భావించినట్లు గుర్తు చేశాడు. అయినప్పటికీ, మైదానంలో ఫుల్ టైమ్ ప్లేయర్‌గా ఉండటానికే ధోనీ ప్రాధాన్యత ఇస్తున్నాడని వివరించాడు.

**శివమ్ దూబే బౌలింగ్ వివాదం.. మేనేజ్‌మెంట్‌దే తప్పు:**

మరోవైపు, సీఎస్కే టీమ్‌లో శివమ్ దూబే బౌలింగ్ చేయకపోవడంపై వస్తున్న కథనాలను బద్రీనాథ్ ఖండించాడు. టీమిండియా తరఫున రెగ్యులర్‌గా బౌలింగ్ చేసే దూబేను సీఎస్కే తరఫున ఆడించేటప్పుడు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన అడ్డువస్తోందనడం సరికాదన్నాడు. దూబే చేత బౌలింగ్ వేయించకపోవడం అనేది పూర్తిగా సీఎస్కే మేనేజ్‌మెంట్ వ్యూహాత్మక లోపమే తప్ప ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్పు కాదన్నాడు. అతనిని కేవలం బ్యాటర్‌గానే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఎందుకు ఉపయోగిస్తున్నారు? అని బద్రీనాథ్ ప్రశ్నించాడు.

**అకీల్ హొస్సేన్ ప్లేయింగ్ ఎలెవన్ లో తీసుకోండి:**

వెస్టిండీస్ స్టార్ స్పిన్నర్ అకీల్ హొస్సేన్‌ను ప్లేయింగ్ ఎలెవెంలో నేరుగా ఎంపిక చేయకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా రిజర్వ్‌లో ఉంచడంపై కూడా బద్రీనాథ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అకీల్ హొస్సేన్ కచ్చితంగా ప్రధాన జట్టులోనే ఉండాలని, కానీ సీఎస్కే మొదట సరిగ్గా బ్యాటింగ్ చేయకపోగానే అదనపు బ్యాటర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా తెచ్చి హొస్సేన్‌ను బెంచ్‌కే పరిమితం చేస్తోందని మండిపడ్డాడు. ఇది తెలివితక్కువ నిర్ణయం.. మీ సొంత నిర్ణయాల లోపానికి ఐపీఎల్ నిబంధనలను నిందించడం సరికాదంటూ చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు.

# మహేష్ మైండ్ లో రన్ అవుతోన్న ఇద్దరే ఇద్దరు!

సూపర్‌స్టార్ మహేష్ -దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో అడ్వెంచర్ డ్రామా -వారణాసి- జాతీయ స్థాయిలో అంచనాలు అంతకంతకంతకు పెంచేస్తోంది. సినిమా కోసం మహేష్ ప్రత్యేకమైన ఫిజికల్ మేకోవర్ పొందుతూ ప్రపంచస్థాయి వర్క్‌షాప్‌లలో పాల్గొంటున్నారు. అయితే ఈ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ తర్వాత మహేష్ తదుపరి చిత్రం ఏ దర్శకుడితో ఉండబోతోంది? అనే అంశం ఇప్పటికే ఫిలిం సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ ఎంచుకునే ప్రాజెక్ట్ అదే స్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో ఆయన మైండ్‌లో ఇద్దరే ఇద్దరు పవర్‌ఫుల్ దర్శకులు రన్ అవుతున్నారని బలమైన ప్రచారం జరుగుతోంది.

వారిలో ఒకరు రా అండ్ రస్టిక్ యాక్షన్ మేకర్ సందీప్ రెడ్డి వంగా కాగా.. మరొకరు విజనరీ మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్. వీరిద్దరిలో ఒకరికే మహేష్ తదుపరి సినిమా చేసే అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తీర్చిదిద్దే క్యారెక్టరైజేషన్లు, హై-వోల్టేజ్ ఎమోషన్లు హీరోల ఇమేజ్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తాయి. మహేష్‌లోని వింటేజ్ మాస్ ,







ఇంటెన్సిటీని బయటకు తీసే సామర్థ్యం సందీప్‌కు ఉందని అభిమానులు సైతం భావిస్తున్నారు. గతంలోనే ఇద్దరి మధ్య చర్చలు జరిగినప్పటికీ, సరైన సమయం కోసం నిరీక్షించారు. తాజాగా -వారణాసి- తర్వాత మహేష్‌ను మరో స్థాయిలో నిలబెట్టే పవర్‌ఫుల్ కథ సందీప్ వద్ద ఉందనే వార్తలు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు ప్రశాంత్ నీల్ తనదైన బిగ్ స్కేల్ లార్జర్ ద్యాన్ లైఫ్ ఎలివేషన్లకు, వరల్డ్ బిల్డింగ్‌కు పేరుగాంచారు. -కెజిఎఫ్-, -సలార్- వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ప్రశాంత్ నీల్ మేకింగ్ స్టైల్ మహేష్ మాస్ ఇమేజ్‌కు తోడైతే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం తప్పదనే అంచనాలు ఉన్నాయి. ఇద్దరి కాంబినేషన్ కుదిరితే భారీ అంచనాలతో గ్లోబల్ వైడ్ మార్కెట్‌ను టార్గెట్ చేయడం సులువవుతుంది. రాజమౌళి కాంబినేషన్ తర్వాత ప్రతీ కథానాయకుడిపై మార్కెట్ ఒత్తిడి .. ప్రేక్షకుల అంచనాలు భారీ పెరుగుతాయన్నది వాస్తవం. అలాంటి సమయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా తన రేంజ్‌ను నిలబెట్టుకునేలా సందీప్ రెడ్డి వంగా లేదా ప్రశాంత్ నీల్‌లతో ముందుకు వెళ్లడమే సరైన వ్యూహమని మహేష్ భావిస్తున్నట్లు సమాచారం. ఇద్దరిలో ఎవరు ముందుగా మహేష్‌ను మెప్పించే స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తారో? వారితోనే ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మొత్తానికి మహేష్ భవిష్యత్తు ప్రాజెక్ట్‌లపై స్పష్టమైన ప్లానింగ్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా అందించే ఇంటెన్స్ డ్రామానా లేక ప్రశాంత్ నీల్ సృష్టించే లార్జర్ ద్యాన్ లైఫ్ యాక్షన్ వరల్డా అనే దానిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965